ముసలమ్మా, ఆమెకోడలు కూడా గేటు దగ్గరకొచ్చి తమ కేసు ఏమిటో వాళ్ళ మాటల్లో చెపుతున్నారు.

చెప్పి –

"అవునమ్మాయ్ వాళ్ళు జొరావరీ చేసి యింట్లో కొచ్చేమాటైతే కుక్కల్ని ఉసికొల్పుతామన్నాము. తప్పా?" అంది ముసలమ్మ.

"ఓలమ్మ! ఓలమ్మ! ఎంత అబద్దఁవో" అంది సత్యవతి.

ఉండుండి నీళ్ళ పోతల అప్పాయమ్మ సభవరి ధోరణిలో మధ్యకొచ్చింది.

"ఆగండి! ఆగండి!" అంటూ అరచేత్తో వాళ్ళనూ వీళ్ళనూ వారించింది.

"ఏటమ్మా! ఏటి సంగతంతా?" అంది ముసలమ్మతో, ఆ గొంతూ, ఆమె వయసూ, వేషం చూడగానే ముసలమ్మకు ధైర్యం కలిగింది. తను కూడా గొంతు తగ్గించి వీలైనంత మంచిగా చెపుతోంది.

"నువ్ చెప్పమ్మాయ్. వాళ్ళు నీళ్ళు కొచ్చేరు. ఇదేం వీధి కొళాయి కాదు కదా? మేం మా డబ్బెట్టి యేయించుకున్నది. ఏటా మేం మునిసిపాలిటీకి పన్ను కూడా కడుతున్నామాయె.

అలాటప్పుడు –

ముందు మా పిల్లలొచ్చి చెప్పేరు. వీళ్ళు ఆళ్ళ మాటలు చెవిని పెట్టలే. ఆ తరువాత నేనొచ్చి చెప్పేను. మా మాలీ వస్తే "నువ్ మగాడివైతే కుక్క నుసికొట్టు" – అంటుంది ఆ పిల్ల. వేలెడు లేదు మళ్ళీ –"

అంటూ సత్యవతిని వేలుపెట్టి చూపించింది –

"ఏం మా యింటిమీద కొచ్చి ఆగం చేస్తే మేం ఊరుకుంటామా? యింతకీ మా అబ్బాయ్ ఉండాల్సింది. ఉంటే తెలిసొచ్చేది" అంది ముసలమ్మ.

"ఏం మీ అబ్బాయి గారుంటే ఏటిసేస్తారమ్మా. పట్టి కట్టించేసి ఖయిదులో ఎట్టిస్తారు. అంతేనా? ఆ పని నువ్వే సేయించు. ఇలాగ మీ యింటిమీన పడి నీళ్ళివ్వవంటే తన్ననాని కొచ్చినాఁవని – ఈళకాడ సెప్పినట్టే – దొంగకేసు యెట్టించు" అంది సత్యవతి.

"దొంగ కేసెందుకయ్యింది. ఇప్పుడు మీరంతా ఇక్కడున్నారంటే ఎందు కున్నట్టు. దొమ్మీ కేసెట్టాలంటె ఇది సాల్దా?" అన్నాడు మాలి.

"నువ్వూరుకో అబ్బాయి" అంటూ మాలీని ఆపి సత్యవతితో –

"అట్టా కాదమ్మాయ్ నీకు నీళ్ళు కావలిస్తే అడగవలసింది ఇక్కడ కాదు. పోయి మునిసిపాలిటీ వాళ్ళని అడుగు" అంది ముసలమ్మ.

"ఆళ్ళు మాగోడు ఇనిపించుకునే మాటైతే నీ గేటుకాడా నీ గేటుకాడా ఈ పఁరాకులన్నీ ఎందుకమ్మా" అంది మందలో మనిషి.

"ఎక్కడ లేని నీళ్ళూ నీలాటోళ్ళ మొక్కలకే సాలవ్. ఆళ్ళు మాత్రం ఎక్కణ్ణించి తెస్తారు?" అంది సత్యవతి.

"నీకా కన్నెర్ర దేనికమ్మాయ్, నువ్వూ మొక్కలు కాపోతే యవసాయాలే పెంచు. మేవేం కాదన్నావఁవా" అంది ముసలమ్మ.

"ఆగండి, ఆగండి" అంది మళ్ళా అప్పాయమ్మ. ఆమె మాటలతో రెండు పక్షాలూ మళ్ళా ఆగిపోయేరు.

"అయితే యింతకీ ఏటంటావమ్మా?" అంది అప్పాయమ్మ.

ముసలమ్మకు ఆ మనిషి గొంతు వినగా పక్షాలు మారిపోయినట్టు అని పించింది.

"ఏవిటనడం?" అంది ఎదురుప్రశ్నగా.

"కాదు, నీళ్ళు యిస్తానంటావా యివ్వనంటావా?"

అప్పాయమ్మ గొంతు మార్చింది.

ముసలమ్మ మళ్ళా సందేహంలో పడ్డది – యింతలో – "మీరంతా పొగరుగా మాటాడితే యివ్వం. మంచిగా అడిగితే ఆలోచిస్తాం" అంది వెనకనించి మనవరాలు.

"పొగరా! పొగరా?" అంటూ అప్పాయమ్మ ఆమెకేసి తిరిగింది.

"అమ్మా! మాకాడ ఏటుందని మీ దగ్గర పొగరు సూపిస్తాఁవు?" అంది ఆశ్చర్యపోతున్నట్టు.

అని –

"ఒక అందం వుందని యిరగ బాటా, ఒకసందం వుందని యిరగ బాటా, లేప్పోతే మళ్ళూ మాన్నేలు డబ్బూ మీకన్నా మాకు ఎక్కువుందని యిరగబాటా, ఏటి సూసుకొని మీ ముందు యిరగబడి పోతాం?" అంది అప్పాయమ్మ –

"యియన్నీ కొంత కాప్పోతే కొంతున్నా పోనీ, యిరగబడితే అనిపోతాది. మీ ముందు మాకు యిరగబాటా, ఆ గుంటలకేటో తెలియక అలా వోగుతారు."

అంటూ ముగించింది అప్పాయమ్మ.

"అలాగన్నావు. బాగుంది" అనుకుంది ముసలమ్మ.

"మనిషి ఒక్కొక్క బిందె పట్టుకుపోండి. మళ్ళా యీ ఛాయల కెప్పుడూ రాకండి" అంది ఖరాకండీగా నొక్కిచెపుతూ.

ఆమె అలా అనడమేమిటి – అప్పాయమ్మ సొంత యిల్లులా – గేటు తెరిచేసింది.

"రండ్రా రండి" అంది – తలతో అందరికీ దారిచూపుతూ. అందరూ కదిల్నా అమ్మాజీ, సత్యవతీ కదల్లేదు.

